క్లుప్తంగా

సరిహద్దు దాటిన సేవలు



ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న వలంటీర్

నగరి: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అక్కడికే వెళ్లి పెన్షన్ అందిస్తున్నారు. మున్సిపల్ పరిధి కాకవేడుకు చెందిన దివ్యాంగుడు ఎం.గోపాల్ టీబీ వ్యాధితో చెన్నై, తాంబరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి పెన్షన్ అవసరాన్ని గుర్తించిన వలంటీర్ ఏ.తేజ గురువారం చెన్నైకి వెళ్లి అందించింది. అక్కడే చికిత్స పొందుతున్న తమిళనాడు వాసులు మన రాష్ట్రంలోని సచివాలయ, వలంటీర్ వ్యవస్థ, ప్రభుత్వం పెన్షన్ అందించే విధానంపై ప్రశంసల వర్షం కురిపించారు. తమిళనాడులో ఇలాంటి సదుపాయం తమకు లేదని బాధపడ్డారు.

నిర్మాణాలు చేపట్టని వారికి నోటీసులు

నింద్ర: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు నోటీసులు అందించినట్లు హౌసింగ్ ఏఈ శ్రీధర్ రాజు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు పూర్తి చేయకుండా ఉన్న వారికి పలు సార్లు అధికారులు ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు నోటీసులు అందించినట్లు పేర్కొన్నారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని, లేకుంటే పట్టా రద్దు చేసి అర్హులైన వారికి కేటాయిస్తారని తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా సుధాకర్



గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా సుధాకర్ నియమితులయ్యారు. ఈయన కార్యాలయంలో అడ్మిన్‌స్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఎంపీడీవో గా అదనపు బాధ్యత లు అప్పగిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న శ్రీదేవి డీఎల్‌డీవోగా పదోన్నతిపై బదిలీ అయిన విషయం తెలిసిందే.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్టుకు బెంగళూరుకు చెందిన దాతలు మురళీకృష్ణ, మహేశ్వరి రూ.5లక్షలు విరాళం అందించారు. ఉదయం దాతల కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డికి స్వామివారి గో సంరక్షణ ట్రస్టుకు రూ.5లక్షలు విరాళంగా అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గుడిపాల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు ఏఎస్ఐ చలపతి తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన మహదేవన్(28) గురువారం బెంగళూరు నుంచి చెన్నైకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నరహరిపేట చెక్‌పోస్ట్ ఆవరణలో భద్రకాళమ్మ గుడివద్ద గుర్తు తెలియని కారు ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మహదేవన్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 వాహనంలో రాణిపేట సీఎంసీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తోందని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. గిరింపేట లోని పాతకలెక్టరేట్‌లో గురువారం కలెక్టరేట్ యూనిట్ రెవెన్యూ భవనానికి భూమి పూజ నిర్వహించారు. ఆ సంఘ నాయకులు నిర్వహించిన పూజా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని శిలాఫలకం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో రాజశేఖర్, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, ఆర్డీవో చిన్నయ్య, జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమర్‌నాథ్, హుస్సేన్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు పార్థసారథి, హేమాద్రిరాజు, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు

విధి నిర్వహణలో అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు. పాతకలెక్టరేట్‌లోని పలు శాఖలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఆయా శాఖ ల్లోని పలు విభాగాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పురాతన రెవెన్యూ రికార్డుల రూంలోకి వెళ్లి రికార్డులను పరిశీలించారు. 1947 నుంచి రెవెన్యూ రికార్డులు ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఆ రికార్డుల భద్రతకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో రాజశేఖర్, ఏవో కులశేఖర్ పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యానికి మెరుగు



స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ (సీస్) పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

- నేడు స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ (సీస్) పరీక్ష
- వచ్చే ఏడాది ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో పరీక్షలు
- ముందుగా సీస్ పరీక్షలు నిర్వహించనున్న రాష్ట్ర ప్రభుత్వం

నగరి: స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ (సీస్) పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ పరీక్ష శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు. గతంలో నాస్ పరీక్షలు 3, 5, 8 తరగతులకు నిర్వహించేవారు. ఈ ఏడాది 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించనున్నట్టు ఎన్‌సీఈఆర్‌టీ ప్రకటించింది. ఎంపిక చేసిన పాఠశాల్లో మాత్రమే ఓఎంఆర్ విధానంలో పరీక్షలు ఉంటాయి. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లోనూ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు ఎలా ఉపయోగపడుతాయి?.. పాఠశాలకు విద్యార్థులు ఎలా చేరుకుంటారు..? తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎలా ఉంది..? పాఠశాల వాతావరణం..? తదితర అన్ని అంశాలపైనా నాస్ సర్వే ఉంటుంది.

పరీక్ష విధానం

తరగతుల వారీగా విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను సాధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు నూతన సంస్కరణలను తీసుకొస్తున్నాయి. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతి సిలబస్‌ను, 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతి సిలబస్, 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్‌పై పరీక్షలు నిర్వహిస్తారు. 3, 6 తరగతులు లాంగ్వేజ్, గణితం ఈవీఎస్ సబ్జెక్టుల్లో 40 ప్రశ్నలు 60 నిమిషాల్లో, 9వ తరగతి విద్యార్థులు లాంగ్వేజ్, గణితం, సైన్స్ సోషల్ సబ్జెక్టుల్లో 60 ప్రశ్నలు 90 నిమిషాల్లో రాయాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవడానికి వీలుంటుంది.

ప్రతి పాఠశాల నుంచి పాల్గొనాలి



జిల్లాలో శుక్రవారం జరిగే స్టేట్ ఎడ్యుకేషన్ అఛీవ్మెంట్ (సీస్) టెస్టుకు ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనాలి. 3, 6, 9 తరగతుల నుంచి 30 మంది చొప్పున విద్యార్థులు పాల్గొనాలని హెచ్‌ఎంలకు సూచించాం. ఇప్పటికే చాలా పాఠశాలల్లో సీస్ పరీక్షలకు విద్యార్థులతో మోడల్ పరీక్షలు నిర్వహించాం. పాఠశాల స్థాయిలో అభ్యాసకుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ఎన్సీఈఆర్టీ నిర్వహించే నాస్ పరీక్ష విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

\- పిఎస్. శ్రీదేవి, ఎంఈఓ

స్కాలర్‌షిప్‌ల మంజూరు భేష్



విద్యార్థులను ప్రశ్నిస్తున్న అధికారుల బృందం

పుత్తూరు రూరల్: ఉపకార వేతనాలు షెడ్యూలు కులాల విద్యార్థులకు అందుతున్న తీరు, నిధుల నిర్వహణ చాలా బాగుందని కేంద్ర, రాష్ట్ర అధికారుల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. పుత్తూరు పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం షెడ్యూలు కులాల విద్యార్థులకు అందుతున్న ఉపకార వేతనాల వినియోగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో కేంద్ర సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వ శాఖకు చెందిన ప్రియాంకతోమర్, సౌరభ్‌రంజన్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రియాంకతోమర్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఎస్సీ విద్యార్థికి స్కాలర్‌షిప్ అందించేందుకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి, సుజన, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో రైతులకు మెరుగైన సేవలు



రైతులకు సబ్సిడీ ఉలవలు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాలసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతుందని వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ జీ మహేష్ తెలిపారు. శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో గురువారం ఏఓ ఢిల్లీప్రసాద్ ఆధ్వర్యంలో రైతులకు, వలంటీర్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. శేఖర్ యాదవ్ మాట్లాడుతూ కియోస్క్ విధానం వలన అన్నదాతలకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులతోపాటు సకాలంలో అన్ని సేవలు గ్రామాల్లోనే అందడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఆర్బీకేల్లో కియోస్క్ యంత్రాల ద్వారా రైతులే స్వయంగా విత్తనాలు, ఎరువులు ఆర్డర్ చేసుకునే అవకాశం కల్పించారు. అనంతరం ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసిన ఉలవలను రైతులకు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

నింద్ర: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ దీప అన్నారు. గురువారం వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై ఆమె సమీక్షించారు. ఆమె మట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరంగా మారిందని అన్నారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూడాలన్నారు.

బీసీ కాలనీ అభివృద్ధే లక్ష్యం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ

కార్వేటినగరం: బీసీ కాలనీ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని బీసీ కాలనీలో గురువారం రూ. 7లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని సర్పంచ్ ధనంజయ వర్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో బీసీ కాలనీ రోడ్లు రాళ్లు తేలి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేదని గుర్తు చేశారు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో మండల కేంద్రంలోని బీసీ కాలనీ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పటికే బీసీ కాలనీలో రూ.30 లక్షలతో వీధులను సీసీరోడ్లుగా మార్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికి డిప్యూటీ సీఎం నారాయణస్వామిని ఆదరించి ఘన విజయాన్ని అందించి జగనన్నకు కానుకగా అందించాల్సిన బాధ్యత నగర ప్రజలపైన ఉందన్నారు. అనంతరం సర్పంచ్ ధనంజయవర్మ మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని బీసీలు ఆదరించాలని చెప్పారు. ఈ క్రమంలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కో- ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో మోహన్‌మురళి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కేశవులు పాల్గొన్నారు.

పారదర్శక ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీవో సుజన

నగరి: రానున్న ఎన్నికలకు పారదర్శక ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆర్డీవో సుజన అన్నారు. గురువారం స్థానిక మెప్మా కార్యాలయంలో బీఎల్ఓలు, సూపర్ వైజర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లు, అన్ని పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ 2024కి సంబంధించి గత నెల 27న ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. దీన్ని మరొకసారి పరిశీలించి పారదర్శక జాబితా సిద్ధం చేసేందుకు అందరూ కలసి పని చేయాలని సూచించారు. వంద శాతం ఓట నమోదు, 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయడంపై బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకట్రామి రెడ్డి, సర్వే శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, టీపీవో నీరజాక్షి, అర్బన్ లెవల్ టీమ్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పొరబాట్లను సరిచేయాలి

పుత్తూరు రూరల్: ఓటర్ల జాబితాకు సంబంధించి స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 ప్రకారం బీఎల్‌ఓలు డోర్ టు డోర్ సర్వే నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక వైఎస్సార్ సమావేశ మందిరంలో బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలతో ఓటర్ల సవరణ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫారం 6, 6ఎ, 7,8, 8ఏపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. 2024 జనవరి ఒకటి నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కొత్త ఓటర్లకు అర్హులు అవుతారని తెలిపారు. ఓటర్ లిస్టులో చిరునామా మార్పులు, స్థానికంగా లేని వారి పేర్ల తొలగింపులపై బీఎల్‌ఓలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తప్పులు దొర్లితే అయా బీఎల్‌ఓలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వడమాలపేటలో:

బీఎల్‌ఓలు ఓటర్ల జాబితాను క్షుణంగా పరిశీలించాలని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఓటర్ల జాబితాపై బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. డోర్ టు డోర్ సర్వే చేసి ఓటర్ జాబితాలో పొరబాట్లు ఉంటే సరిచేయాలని సూచించారు. బీఎస్ఓలు విధిగా హాజరు కావాలని, హాజరు కానివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్హత కలిగిన ఓటర్లను గుర్తించండి

పెనుమూరు (కార్వేటినగరం): అనర్హత ఓట్లను తొలగించి అర్హత కలిగిన ఓటర్లను గుర్తించి ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ కళావతి అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్వోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మల్టిపుల్ ఓటర్లకు ఫామ్ ఏ ప్రకారం నోటీసులు పంపి తొలగించాలని ఆదేశించారు. పెళ్లిళ్లు చేసుకుని వేరే ఊరికి వెళ్లిపోయి, పుట్టిన ఊర్లో ఓటుహక్కు ఉన్న వారిని విధిగా గుర్తించి వారికి ఓటు హక్కు రద్దు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చనిపోయిన వారి ఓటును వారి కుటుంబ సభ్యుల సమాచారంతో తొలగించాలన్నారు. 18, 19 ఏళ్ల వయసున్న వారి చేత దరఖాస్తులు చేయించాలన్నారు. కొత్తగా ఓటు హక్కుకోసం దరఖాస్తులు చేసుకున్న వారికి డోర్ నంబర్ ఉంటేనే ఓటరు కార్డు వస్తుందన్నారు. ఒకే డోర్ నంబర్‌లో 10 మంది కంటే ఎక్కువ మంది ఉంటే అలాంటి వాటిని ప్రత్యేకంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, మండంలోని బీఏల్వోలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేయాలి

కార్వేటినగరం: మండలంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయలో బీఎల్వోలు, బీఎల్ఏలకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ 30 ఏళ్ల కంటే ఎక్కువ వయసు ఉన్న వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసినప్పుడు వారి ఆధార్ నంబర్‌ను ఈసీ వెబ్‌సైట్‌లో చెక్‌చేసి వారు ఇంతకుముందు ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్నారో చూసి, ఆలస్య నమోదుకు కారణం ఏంటో తెలుసుకోవాలన్నారు. ఫామ్ 8 ప్రకారం ఇతర ప్రాంతాల నుంచి ఇప్పుడున్న ప్రాంతానికి ఓటు హక్కును మార్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు విజయకుమార్, మనోజ్‌కుమార్, రిసోర్స్ పర్సన్స్, బీఎల్వోలు, పలువురు బీఎల్ఏలు పాల్గొన్నారు.







పుత్తూరు: మాట్లాడుతున్న కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, పెనుమూరు: బీఎల్‌వోలకు శిక్షణ, కార్వేటినగరం: మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

రెండవ విడత భూసేకరణ వేగవంతం



క్షేత్రస్థాయిలో అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి

పుత్తూరు రూరల్: టీటీడీ ఉద్యోగుల ఇంటి స్థలాలకు సంబంధించి రెండవ విడత భూసేకరణ పనులను వేగవంతం చేయాలని తిరుపతి ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి వడమాలపేట అధికారులను ఆదేశించారు. గురువారం వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం, ఎస్వీపురంలో జరుగుతున్న రెండవ విడత భూసేకరణ పనులను ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండవ విడతలో సుమారు 100 నుంచి 130 ఎకరాల భూమి అవసరమవుతుందని తెలిపారు. అవసరమైన చోట పట్టాదారుల అభిప్రాయాలను త్వరతగతిన సేకరించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన అర్జీల పరిష్కారం, పెండింగ్ తదితర విషయాలపై సమీక్షించారు. స్పందన అర్జీలన్నింటినీ నిర్ణీత సమయంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహ సంబంధాలు పెంచేందుకే పల్లెనిద్ర



గ్రామసభలో మాట్లాడుతున్న సీఐ

నగరి: పోలీసు వ్యవస్థను ప్రజలకు చేరువ చేసేందుకే పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐ సురేష్ తెలిపారు. గురువారం మండలంలోని తడుకుపేట గ్రామంలో ఆయన పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభ ఏర్పాటుచేసి పోలీసు వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలతో మమేకం కావడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు సంబంధిత సమస్యల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలని, ఏ విషయమైనా పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని, గొడవలకు దూరంగా ఉండాలన్నారు. సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకుంటే ప్రశాంత వాతావరణం నెలకొంటుందని తెలిపారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో గొడవలకు ప్రధాన కారణమయ్యే సారా, గంజాయి, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలను గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. రాత్రి గ్రామస్తులతో కలిసి బస చేశారు. వైస్‌ఎంపీపీ కన్నియప్ప, సత్య, సంజీవిరెడ్డి, ముత్తువేలు రెడ్డి, గణపతి రెడ్డి, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ



వితరణ చేసిన దుస్తులతో విద్యార్థులు

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరచిన విద్యార్థులకు జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఓంప్రకాష్ ఉచితంగా క్రీడా దుస్తులు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 30 జతల దుస్తులను వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడా రంగంలో ప్రావీణ్యం సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలన్నారు. దాతల వితరణను సద్వినియోగం చేసుకుని రాణించాలన్నారు. విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ చేసిన ఉపాధ్యాయులు ఓంప్రకాష్‌ను అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు దూరం



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు

కార్వేటినగరం: పరిసరాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు దూరమవుతుందని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మండల పరిధిలోని సురేంద్రనగరం దళితవాడ,, సురేంద్రనగరం గ్రామాల్లో గురువారం పరిసరాల శుభ్రతను పరిశీలించారు. జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి మాట్లాడుతూ గ్రామ వీధుల్లో వర్షపు నీరు నిల్వలు లేకుండా చూడాలన్నారు. వ్యర్థాలు ఇంటి ఆవరణలో లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వారంలో ఒక్కరోజు డ్రైడే పాటించి నీరు నిల్వఉన్న పాత్రలను కడిగి ఎండ బెట్టాలని తెలిపారు. కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ బాటిళ్లు, టైర్లు వంటి వాటిలో వర్షపు నీరు నిల్వ చేరడం వల్ల లార్వాలు, దోమలకు నిలయంగా మారి డెంగ్యూ, మలేరియా, డయేరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతకమైన జ్వరాలు సోకే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి వారం శుభ్రత లేని ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్ చల్లి, పరిశుభ్రతను మెరుగు పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం పరిశుభ్రత లోపించిన ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి పరిసరాలను మెరుగుపరిచారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ ఆన్‌లైన్ రీడింగ్ తప్పనిసరి



పెనుమూరులో విద్యుత్ మీటర్లను పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): విద్యుత్ మీటర్లలో ఆన్‌లైన్ రీడింగ్ తప్పనిసరిగా పొందుపరచాలని విద్యుత్‌శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ) కృష్ణారెడ్డి అన్నారు. పెనుమూరులో గురువారం విద్యుత్ వినియోగదారుల మీటర్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ చౌర్యాన్ని విధిగా గుర్తించి కేసులు నమోదు చేసేందుకు ముందుగా హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించారు. బకాయిలు పెండింగ్ లేకుండా నెలవారీ బిల్లులు చెల్లించే విధంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. పలు దుకాణాల విద్యుత్ మీటర్లను పరిశీలించారు. ఎస్ఈ వెంట ఈఈ పద్మనాభం, డీఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, ఏఈ నీరజ, విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.

బీఎల్ఓలు బాధ్యతగా పని చేయాలి

పాలసముద్రం: మండల పరిధిలోని బీఎల్‌ఓలు ఓటర్ల జాబితాలో చేర్పాలన్నా, తొలగించాలన్నా ఒకటికి రెండు సార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తహసీల్దార్ బాబు తెలిపారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు, రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మృతి చెందిన, ఓటర్ల జాబితాలో ఒకటి కన్నా ఎక్కువ సార్లు పేర్లు నమోదైన వారి ఓట్లు తొలగించాలని సూచించారు. ప్రస్తుతమున్న జాబితాలో ఫొటో సరిగా కనిపించకున్నా మార్చుకునేందుకు అవకాశం ఉంది. వయసులో వ్యత్యాసాలున్నా, ఓటరు ఇంటి అడ్రస్, వ్యక్తిగత వివరాల్లో మార్పులు, చేర్పులకు వెసులుబాటు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల పరిధిలోని బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

అర్హులైన ఓటర్లను గుర్తించండి

శ్రీరంగరాజపురం: మండలంలోని అర్హులైన ప్రతి ఓటర్లును గుర్తించాలని తహసీల్దార్ బెన్నురాజు అన్నారు. మండల కేంద్రంలో బీఎల్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డబుల్ ఎంట్రీలను, మరణించిన వారి పేర్లను గుర్తించి రద్దు చేయాలని సూచించారు. డోర్ నంబర్ సున్నా ఉన్న ప్రతి ఓటర్లను క్షుణ్ణంగా పరిశీలించి, డోర్ నంబర్ కేటాయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లోకనాథ పిళ్లై, ఎంపీడీఓ కృష్ణయ్య పాల్గొన్నారు.